ప్రదం ! రీజెనల్ సెంటర్ నుండి మా గ్రామానికి నేను చేపట్టిన మెయినురోడ్డు స్కీము ఈ సంవత్సరాంతంలోగా ముగియాలి. జరిగే తీరుతుంది! ఆ-అన్నట్టు ఈ ప్రాంతంలో ఓం ప్రథమంగా మొక్క-జొన్న పంట పండించబోతున్నాం. చేల గట్లలో రకరకాల కూరగాయలూ సమృద్ధిగానే పండుతున్నాయి. ఆ లోటు మాకు తీరిపోయింది. మీకు మొదట ఎదురు ఆడ ఆ అమ్మాయిల కృషివల్ల ఇది సాధ్యమైంది. ఇద్దరూ ఇంకా అవివాహితలే !"

....o....

## సాలభంజ

అరుదైన కథలకు - అపురూపవేదిక

# అభివృద్ధి

- కొడవగంటి కృష్ణమూర్తి

మా వూరు ఇప్పుడిలా వుంది కాని ఒకప్పుడు ఎలా వుండేదో చాలామందికి తెలియదు. నేను ఎంతోమందిని అడిగాను. ఎంతమందో ఎన్నో విషయాలు చెప్పారుకాని, నాకేవిధమైన తృప్తి కలక్కపోవడంచేత నా ప్రయత్నం విషయమై మరింత శ్రద్ధ వహించాల్సి వచ్చింది. నా ప్రయత్నాలన్నీ నన్ను నేరుగా యానాది చిన్నపోలాయి దగ్గరికి తీసుకునిపోయినై. తాతలకాలం నాటినించీ వాళ్ళీ వూళ్ళోనే నివసిస్తున్నారు. నాకు తెలిసిన విషయాలకు నాడి ప్రకరణంకూడాచేరిస్తే సర్వం విదితం అవుతుందని నాకు గట్టి నమ్మకం కలిగింది.

నిజానికి చిన్నపోలాయి నాకు కొత్తవాడుకాకపోయినా వడిల్లు కనుక్కొని చేరేటప్పటికి చాలాకష్టం అయింది. మేము ఈ చివర వాడు ఆచివరనాయె! వాడు

రోజు ఇంతదూరంనించీ పెద్ద చిదంబరంగారింటికి పనిపాటలకు వస్తాడు. కాయ తుడుస్తుండగా, పిల్లల్ని అడిస్తుండగా ఎన్నోసార్లు చూశాను. కాని నాకు కావలిసిన విషయం వాడివల్లనే తెలుస్తుందని వూహించుకోలేకపోయినాను. వాడిని అడుగు దామని అనుకుంటుండగా రెండు మూడు రోజుల్నుంచి కనిపించనేలేదు. అందు వల్ల నేనే వాడింటికి వెళ్ళక తప్పలేదు.

ఒకప్పుడు పెద్దపోలాయి (చిన్నపోలాయి తాత) కుటుంబం గుడిసెలు వున్న చోట ప్రస్తుతం మిషనరీ బంగాళావుంది. ఆ రోజుల్లో ప్రస్తుతం మా వూళ్లో రాజ వీధిగా పరిగణింపబడే సిమెంటురోడ్డులో వుండే కొద్దికొంపలూ, వాటినానుకుని అటూఇటూ కొన్ని పూరిళ్ళు కలిసి మొత్తం వూరుగా వుండేది. కొద్దిదూరంలో దిబ్బమీద పెద్దపోలాయీ, తదితర ఎరికల యానాది గుడిసెలూ వుండేవి. ఇంకా అవతల కొంతదూరంలో మాలకొంపలుండేవి. పెద్దబజారులో మాత్రం రెండు కోమట్ల ఇళ్లుండేవి. ముందు వసారాలలోనే వాళ్ళు అవీ ఇవీ తెచ్చి చిల్లర వ్యాపారం చేస్తూవుండేవారు.

మొదట మా వూళ్లో బియ్యం మర ఏర్పాటు చేయించింది. చిన్నచిదంబరంగారు (పెద్దచిదంబరంతాత), దాంతో మరబియ్యం ఎక్కడినుంచో బళ్ళమీద అవస్తపడుతూ తెచ్చుకోవలసిన అవసరంలేకుండా పోయింది, పెద్దపోలాయికి చిన్నచిదంబరంగారి బియ్యంమరలో కూలీ దొరికింది పెద్దపోలాయి హోదా తదితర యానాదివాళ్ళకు గుర్రుగావుంటే, బియ్యం మర వ్యాపారంచేసే కోమట్లకి మరింత గుర్రు కలిగించింది. కారణం వాళ్లు ఇదివరకు మాదిరిగా మరబియ్యం అమ్మటానికి వీలులేకుండాపోయింది. ఎవళ్ళకు బియ్యం కావలిసినా బస్తాధాన్యం మరదగ్గరికి తీసుకపోవటమూ, బియ్యం చేయించుకోవటమూ జరిగేది. ఆ కారణంగా చాకిరీచేసే యానాదివాళ్ళలో పెద్దపోలాయికీ, వ్యాపారంలో చిన్నచిదంబరంకూ అవినాభావ సంబంధం ఏర్పడింది.

మెలమారంలో రైలుమార్గం ఏర్పాటుకావటం చెప్పుకోతగిన సంఘటనలలో మొదటిది, మావూరినుంచి వెళ్ళేదొంకా, రైలుమార్గమూ కలిసినచోట చిన్నరైలు

స్టేషనుకూడ నిర్మించారు. అక్కడ మొదటిసారి రైలు ఆగినప్పుడు మా వూళ్లో జనం కొబ్బరికాయలు తీసికెళ్ళి కొట్టారు. ఏ ఆకారంలోఉన్నా అది శక్తిస్వరూపిణి! అదివరకు డొంకలావున్నది ఒకవిధమైనరోడ్డుగామారింది రైలుమార్గంలో ఈ రోడ్డుకు అటూ ఇటూ పూరిగుడిసెలు ఏర్పాటయి కొన్ని చిల్లర దుకాణాలుకూడా స్థాపించబడినై, అదే తర్వాత రైలుపేటగా మారింది.

మావూళ్ళో తర్వాత పంచాయతీబోర్డు ఏర్పడి బురదగా, రొచ్చుగావుండే రోడ్లు కంకరరోడ్లుగా మారినై. ఇప్పుడు గాంధీచౌకుగావున్న ఆవరణమధ్య ఆ రోజుల్లో మూడుదీపాల స్తంభం ఒకటివుండేది. సాయంత్రం అది వెలిగించే సమయంలో జనంచేరి చూచేవాళ్లు పిదప వూరినుంచి రైలుస్టేషనుకుకూడా కంకర రోడ్డు పడడంచేతనూ, జనసౌకర్యం, సౌఖ్యం తప్పనిసరికావడంచేతనూ వూళ్లో నుంచి స్టేషనుకు గుర్రబ్బళ్ళు తయారయినై. ఈ గుర్రబ్బళ్లు తోలేవాళ్ళు ఎక్కువగా సాయిబులు. వీళ్ళు ఎక్కువగా రైలుస్టేషను ప్రాంతాల గుడిసెలలో వుండేవాళ్ళు, కొంచెం డబ్బువున్న ఒక సాయిబుమాత్రం గాంధిచౌకులో ఒకకొట్టులో సోడా ఫ్యాక్టరీ స్థాపించాడు రాత్రిపూట పెట్రోమాక్సు లైటుకాంతిలో ఆ సోడా సీసాలు రంగురంగు నీళ్ళతో చూడటానికి ముచ్చటగా వుండేవి. కొట్టుముందు వూడ్చి నీళ్లు చల్లించేవాడు. దాహం ఎక్కువైన పెద్దమనుష్యుల విశ్రాంతికొరకై రెండు చిన్నబెంచీలు అటూ ఇటూ ఏర్పాటుచేశాడు. నేత్రానందకరంగా వుండటానికి నాలుగయిదు క్రోటన్సు తొట్లు పెట్టాడు. ఆ సాయిబు కొడుకు హయాం వచ్చేటప్పటికి, ఆ కొట్టు అతను కొనెయ్యటమూ పీర్లపండుగ ఆఖరురోమన గాంధీచౌకులో పీర్లగుండాన పడటమూ ఆచారమైపోయింది.

రైతు వృత్తికష్టపరంగా కనిపించిన ఒకరిద్దరు మరి రెండు బియ్యంమరలు లేవదీశారు. కాని చిదంబరంగారు (చిన్నచిదంబరం కొడుకు, పెద్ద చిదంబరం తండ్రి) అప్పుడే తండ్రి దగ్గర్నుంచి వ్యాపారం పుచ్చుకొని వుండటంచేతనూ, యువకుడు కావటంచేతనూ వుత్సాహంతో దూరాలోచన చెయ్యగలిగాడు. వూళ్లో వాళ్ళే పోటీకొస్తే సర్వం సున్నా అవుతుందని గ్రహించి కోమట్లతో చేతులు కలి

పాడు. కేవలం బియ్యంమర కాకుండా రైసుమిల్లు ఏర్పాటుచేస్తే మరింత లాభ దాయకంగా వుంటుందని నమ్మించాడు. ఆ కోమట్లు వాళ్ళ పెట్టుబడికి తగిన ప్రతిఫలం వచ్చేలాభంతో పంచుకోవచ్చునని విశదీకరించాడు. చిదంబరంగారు, ఆ కోమట్లు కలిసి అన్నపూర్ణ రైస్‌మిల్ లేవదీశారు, ఆ రోజుల్లో ఈ రైస్‌మిల్లు గొట్టంలోనుంచి చిక్‌చిక్‌మంటూ వచ్చేపొగా, ఆ ఆవరణలో ఆరోజుకారోజుకు పెరుగుతూ తర్వాత తగలపెట్టబడుతూవుండే ఆ వూకా అదో వింతదృశ్యంగా వుండేది. రైతులు పెట్టిన బియ్యంమరల రేట్లకన్న ఈ రైసుమిల్లురేట్లుతక్కువగా వుండటంచేత రైతుల బియ్యంమరలు దెబ్బతిన్నాయి, ఆ రైతులూ అంతటితో తృప్తిచెందక వ్యవసాయం మానదలుచుకున్నమరికొందరి రైతులతో వాటాలుచేర్చి మరో నేషనల్‌మిల్లు ఏర్పాటుచేశారు. ఈ రెండుమిల్లుల కారణంగా మా వూళ్లో బియ్యం వ్యాపారం బాగా సాగింది. అదివరకు ఎక్కడినుంచో తెచ్చుకునే మర బియ్యం ఇప్పుడు మావూరినించే ఇతరగ్రామాలకుబళ్ళమీద రవాణా చేయబడుతూ వుండేది.

మావూళ్లో పోస్టాఫీసు ఏర్పాటుకావటంకన్నా ముఖ్యమైనది పోలీసుస్టేషను ఏర్పాటుకావడం. ఇది ఏర్పాటు చేయడానికి అసలు కారణం చెప్పగలిగింది చిన్నపోలాయి. పోలాయి (చిన్నపోలాయి తండ్రి, పెద్దపోలాయి కొడుకు) హయాంలో ఈ రెండురైసుమిల్లులకూ పోటీలు బాగావుండేవి. అప్పుడు పోలాయి చిదంబరంగారి రైసుమిల్లులో పనిచేస్తూ వుండేవాడు. ఒకరోజున అవతల రైసు మిల్లులో పనిచేసే మరోఏనాది ఏదోమాటవచ్చిపోలాయిని చితకతన్నాడు. పోలాయి ఇంటికివచ్చి తనజనాన్ని పోగుచేసుకుని అవతలవాడిమీద కలియపడ్డాడు. ఇరు పక్షాలవారికి పెద్దయుద్ధం అయింది, అనేకమందికి తలలు పగిలినయి. ఈసంగతి పోలీసుశాఖకు తెలిసి మర్నాడు మా వూరువచ్చి పంచాయతీచేశారు. ఇరుపక్షాల సాక్ష్యమూ విన్నారు. చివరకు మొదట పోలాయిని కొట్టిన యానాదిని అరెస్టుచేసి తీసుకొనిపోయినారు. దెబ్బలుతిన్నా పోలాయికి ఇదంతా మహాదారుణంగా కనిపిం చింది. వాడు తనను ఎందుకు తన్నిందీ పోలాయి వూహించుకోలేకపోయినాడు. చిదంబరంగారి మిల్లులో చిదంబరం, కోమట్లు అవతల రైసుమిల్లువాళ్ళని నానా

మాటలూ అనటం పోలాయికి తెలిసిన సంగతి. దీనివల్ల పోలాయికి అవతల మిలువాళ్లు అంటే ఈర్ష్య, మాత్సర్యం కలక్కపోయినా తనతోపాటు పాటుబడే ఇతరులు కొంతమందికి అవతలమిల్లు వాళ్ళంటే ఎంతో ద్వేషభావము కలిగింది పోలాయికి తెలుసు వాళ్ళూవీళ్లూ కలుసుకున్నప్పుడు ఈ ఈర్ష్య చిన్నచిన్నవిషయాలలో బయటపడేది. ఒకళ్ళంటే ఒకళ్ళకు ఎక్కిరింపూ ఎగతాళి పరిపాటయిపోయింది. మరి పోలాయిని తన్నిన యానాదికూడా ఈరకంగానే మారి వుండాలి. అయితే వాడి మాత్సర్యం మాటలతో ఆగక క్రియారూపం దాల్చింది! రైసు మిల్లుల యజమాన్లు అలాగే నిక్షేపంలావున్నా యానాదిగూడెంలోమటుకు బ్రహ్మాండమైన చీలిక ఏర్పడింది. వీళ్ళ బలాబలాలు వాళ్ళల్లోవాళ్ళు తీర్చుకొనటం అలావుంచి వాములు తగలబడటమూ, దొంగతనాలూ, దొమ్మీలూ ఎక్కువయినై. పోలీసువాళ్ళు తరుచూ మావూరు రావలసిరావటంవల్లవిసిగి ఇక్కడే పోలీసుస్టేషను ఏర్పాటు చేశారు !

మావూరు పెరిగింది. పచారీషాపులూ, బట్టలషాపులూ, ఫ్యాన్సీస్టోరులూ, కాఫీ హోటళ్లూ అన్నీ తయారైనై. వూళ్లో అన్నిమూలలా కిరసనాయిలుదీపాలూ. ముఖ్యకేంద్రాలలో గాస్‌లైట్లు వెలిసినయి. పంచాయితీబోర్డు మారి మునిసిపాలిటీ అయింది. సిగరెట్లు కిళ్ళీల దుకాణాలు విస్తరించినై, జనాభాహెచ్చి వూరు పెరగటంచేత పాకీదొడ్లు అవసరం అయినై. దాంతో పాకీవాళ్లకాలనీ ఏర్పడింది. మునిసిపాలిటీవారు ఒక లైబ్రరీ స్థాపించారు. వూళ్ళో పరిశుభ్రత అత్యవసరం కావటంవల్ల ఇస్త్రీషాపులు బలిసినై. ఆదివరకు ఇంత చద్దిఅన్నంతిని, పుల్లమజ్జిగతాగి, పొగాకుచుట్ట నోటిలోపెట్టుకునిపోయే రైతులసంతతివాళ్ళు ఇప్పుడు పత్రికలు తిరగెయ్యటమూ, పేకాడుకోవటమూ జాస్తీ అయింది, అనేకమంది రైతులే వ్యవసాయంమాని వ్యాపారమూ. మునిసిపాలిటీ ఎన్నికలలోకి దిగారు, నాగయ్యగారి దొడ్లో వీధిబడిగావున్నది, వేరేచోట ఎలిమెంటరిస్కూలుగా ఎప్పుడో మారింది. విద్య, జ్ఞానం అగ్రవర్ణాలకే లభించేరోజులు తిరిగిరాకుండాపోయినై. యాచనచేసే బ్రాహ్మలూ, వ్యాపారంచేసే కోమట్లూ, సేద్యంచేసే రైతులూ, ఇంకా వున్నా బ్రాహ్మణ కాపీక్లబులూ, కోమట్లపత్రికల ఏజంట్లూ, రైతుల రైసుమిల్లులు

కూడా తయారయిన్నై. మా వూరినించి వివిధ గ్రామాలకి మోటారుసర్వీసు కూడా తయారైంది.

మిషనరీవాళ్లువచ్చి పోలాయి కుటుంబాలు నివసించే దిబ్బని కొనేశారు. అక్కడ పెద్దబంగాళా నిర్మించారు. ఆ ఆవరణలోనే చిన్నస్కూలు నిర్మించారు. మా ఊళ్ళో మొదటిసారి చిన్న దొరపిల్లవాడిని ఒక దొరసాని పెరాంబులేటర్‌లో పెట్టి తీసుకుపోతుండగా చూచినవాళ్ళలో పోలాయి వకడు. మిషనరీలు క్రైస్తవులు అయినా వారి విద్యాశాఖలోకి అన్ని కులాలవారూ చేరారు. బ్రాహ్మల కుర్రాళ్ళు మాత్రం ఇంటికొచ్చి బట్టలువిప్పేసి మడికట్టుకోకపోయినా మయిలమాత్రం వదిలేశేవారు! ఇంగ్లీషు రాజకీయభాష కావటంచేతనూ, ఆ భాష బోధించే నేర్పు మిషనరీవాళ్ళకు వుగ్గుపాలతో అలవాటు కావటంచేతనూ వాళ్ళ విద్యాశాల అతి వేగంగా పెరిగింది. అదేం తమాషో మా వూళ్ళో మొదట క్రైస్తవులు లేకపోయినా తర్వాత వాళ్ళశాఖ విచిత్రంగా పెరిగింది. దేముడూ దయ్యమూలేని మాలవాళ్ళ క్రైస్తవులుగా మారటంవల్ల వాళ్ళకు ఒకదేవుడులభించటమేకాక విద్యకూడా సంప్రాప్తించినవి. సర్వత్రా అవిపరకేవున్న దేవుడు వాళ్ళకు అందక ఏ దేశం నించో వచ్చిన దేముడు వాళ్ళకు విముక్తి కలిగించాడు. అదివరకు బ్రాహ్మణ వీధిలోకే రావటానికి తాహతులేని మాలవాళ్ళ కొడుకులు ఇప్పుడు క్రైస్తవులుగా హోదా అనుభవిస్తున్నారు. ఈ మిషనరీవాళ్ళ విద్యావ్యాపకంచూచి వూళ్లో పెద్దలంతా చేరి కమిటీ ఏర్పాటుచేసి ఒక పెద్ద హైస్కూలు స్థాపించారు. ఈ స్కూలుకు అనేకమంది మేష్టర్లు బయటినుంచి రావలసివచ్చింది. మిషనరీ స్కూలులో చదివే చాలామంది ఈ స్కూలులో చేరారు. అయినా మిషనరీ స్కూలుకు ఏ కొరతా కలగలేదు. దానికి కారణం మాలవాళ్లు విరివిగా క్రైస్తవులుగా మారుతూ వుండటం!

వ్యాపార లావాదేవీలూ' ఆస్తులు చేతులు మారటాలూ అలవాటు అయింది. తరువాత జిల్లాకోర్టుకు తాకిడిహెచ్చి చివరకు మా వూళ్లోనే కోర్టు, రిజిష్టరాఫీసు ఏర్పాటు చేశారు. కులవృత్తులు జీవిత సమస్య తీర్చలేకపోవటంచేతనూ, విద్యావ్యాసంకొరకు వున్న ఆస్తినికూడా ఖర్చుపెట్టి చివరకు విద్యాజ్ఞానమేమిగిలి జీవనా

ధారం కలక్కపోయినా కులవృత్తులుమటుకు తిరిగి రాలేదు! న్యాయస్థాపితానికీ, ప్రచారానికీ బోలెడు లాయర్లబోర్డులు మావూళ్ళో వెలిసినై. అనేక గ్రామాల్నించి ఎడ్వోకేట్లు మావూరు చేరారు, పూరివారిగా వీళ్ళకు ఖాతరీ లేకపోయినా, ఆయా వూళ్ళనించి వచ్చేకేసులు వారివారికే లభించటంవల్ల ఈ ప్లీడర్లకు కొంత కాకపోతే కొంత అయినా బ్రతుకుతెరువు ఏర్పడిందని చెప్పకతప్పదు.

మా వూళ్లో గ్యాసులైట్లు, కిరసనాయిలు దీపాలూపోయి ఎలక్ట్రిక్ దీపాలు వెలిగినమాట వాస్తవమేకాని ఆ శక్తి ఎంతో దూరంనించి మా వూరికి లభించటంవల్ల కామాలు అవి ఆట్టే కళాకాంతులు కలిగిలేవు! అయినా రేడియోలు వెలిసి గృహాలు ఎన్నో తయారయినై. మావూరి మునిసిపాలిటీ వున్నట్టుండి రద్దుఅయి స్పెషల్ ఆఫీసరు హయాంక్రిందికి రావటము ముఖ్యమైన విషయమేకాని, అది ప్రస్తుతం ఎత్తగూడని విషయం. కాని మావూళ్ళో ఈ మధ్య రజతోత్సవం జరిగిన హాస్పిటలుచరిత్ర చెప్పకతప్పదు. మొదట్లో అసలు మావూళ్ళో ఏదో కషాయాలూ, గుళికలూ ఆచారి పక్కడుతప్ప అసలు వైద్యుడు అంటూనేలేడు. పాకీదొడ్లువచ్చి వైద్యశాల అవసరాన్ని ఎంతైనా ఆగత్యం చేసినై అని చాలామంది నమ్మకం, కాఫీహోటళ్ళు అనేకమందని అనేకరోగాల్ని యావజ్జీవమూ ఏర్పరచినై అని మరికొందరి విశ్వాసం. ఏమయితేనేం చిన్నఆస్పత్రి నొకదానిని స్థాపించి గవర్నమెంటువారు ఎంతైనా మహోపకారం చేశారని చెప్పాలి, ఆ వేళావిశేషమేమిటో ఆ ఆస్పత్రి శుక్లపక్షపు చందమామలా దినదినాభివృద్ధి చెందింది. మా వూళ్లో రకరకాల రోగాలూ తయారైనై. ఆస్పత్రి చికిత్సలూ అలావుంచి వూళ్లో వున్న వైద్యులకుకూడా తీరుబడిలేదు. వైద్యుల అవసరాన్ని గమనించి అనేకమంది కొత్తవైద్యులు మావూరు చేరుతూ అనేకవిధాల ఈ సమస్యాపరిష్కారానికై పాటుపడుతూనే వున్నారు. ఈ డాక్టర్ల అవసరం నిమిత్తమై అనేక మందులషాపులు వెలిసినై. రకరకాల మందులు, కొత్తకొత్త ఇంజెక్షన్లు, బలహీనులపాలిటి కల్ప

వృక్షంలా నోరూరించే టానిక్కులు ఎన్నెన్నో వచ్చేవి. మందుల వ్యాపారరీత్యా ఆస్పత్రినౌకరీలవల్ల అనేకవిధాలుగా నిరుద్యోగసమస్య కొంత తీరిందని వొప్పుకోవాలి. మావూరి ఆస్పత్రిలో ఇప్పుడు మరి అయిదువందల రోగులకు కావలసిన అన్ని సౌకర్యాలకూ అవకాశం వుందంటే ఎంత అభివృద్ధి చెందిందో తెలుసుకోటాని ఒకప్పుడు మావూళ్లొ అసలుఆస్పత్రేలేదని జ్ఞప్తికి తెచ్చుకుంటేతప్ప సాధ్యం కాదు!

మావూరు యెంతో అభివృద్ధిచెంది ఒక ముఖ్యకేంద్రంగా అయుందనటానికి రుజువుగా విద్యాశాఖమంత్రివచ్చి మానవకోటికి విద్యకంటె వుత్తమమైనది లేదని వాదించారు. పరిశ్రమలశాఖమంత్రి వచ్చి మనదేశానికి పరిశ్రమలు లేకపోవటమే గొప్పలోపమనీ, పరిశ్రమాభివృద్ధి తప్పనిసరిగా జరిగితీరాలనీనొక్కివక్కాణించారు. ఆరోగ్యశాఖమంత్రి వచ్చి స్వయంగా చీపురు పుచ్చుకుని మావూరి రోడ్డుపూడ్చి యెల్లప్రజలూ అలా చెయ్యాలనీ, ప్రతివాడూ పాకీవాడు కావటం యెంతో గొప్పవిశేషమనీ ప్రత్యక్షంగా రుజువుచేశారు. వ్యవసాయశాఖమంత్రి వచ్చి మనకు అనాదినించీ వ్యవసాయమే ఆయువుపట్టుగావుంటూ వచ్చిందనీ, అదిమాని యితర వ్యాపకం చేసినవాడు మనం అధోగతిపాలుకాక తప్పదనీ భయపెట్టారు. మావూరి ప్రజలు యథాశక్తి పాటుపడతారనీ, అభివృద్ధివిషయంలో ఏ ఇతరులకు తీసిపోమనీ మాత్రమే చెప్పగలం!

ఇప్పుడు పెద్దచిదంబరంగారు బంగారుపిచ్చుక. అతని హయాము వచ్చేటప్పటికి రైసుమిల్లేకాక, ఖాదీపరిశ్రమా, ఫ్యాన్సీస్టోర్సు వ్యాపారమూ, సినిమాప్రదర్శనమూ మొదలైన అనేక ఆదాయాభివృద్ధికరమైన వ్యాపకాలు తండ్రి ఏర్పాటు చేసి పోయినాడు. ప్రస్తుతం పెద్దచిదంబరంగారుమటుకు వూళ్ళో ఇళ్ళుకొనటంలో వూపిరి సలపకుండా వున్నారు. చిన్నపోలాయి మాత్రం తాత, తండ్రిలాగా కూలిచెయ్యక పెద్దచిదంబరంగారింట్లో నౌకరీ సంపాదించి జీవించటానికి ప్రయత్నిస్తున్నారు.

"రెండు రోజుల్నించి పంతులుగారింటికి రావటం లేదేం ?" అన్నాను చిన్న పోలాయితో,

"ఏంటోకాక తగుల్లుంది బాబూ ! పోనూ పోదు, పెరగనూ పెరగదు ఏం వెధవరోగమో !"

నేను బయటికి వచ్చేశాను. సొరతీగె అల్లుకునివున్న ఆ పూరిగుడిసెలో నుంచి వస్తున్న పొగ యెదురెండలో శోభాయమానంగా వుంది. అవయవాల్నికూడా కప్పుకోటానికి బట్టలేకుండావున్న చిన్నపోలాయి భార్య నన్నుచూసి సిగ్గుపడి అవతలికి తప్పుకుంది. ఎండలో చిన్నపోలాయి కొడుకు మాత్రం ఆకలితో శామాలు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు !

(ఏప్రిల్ 1948 విశాలాంధ్ర మాసపత్రిక)

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం

---

పెనుక తరాల వారి వీర చరితల సిరుల సేకరణలో సాయపడండి,

# అనిసెట్టి రచనల సంకలనం.

ప్రముఖ రచయిత శ్రీమునిపల్లె రాజుగారు బాధ్యత స్వీకరించారు. సాహితీమిత్రులు అనిసెట్టి రచనల వివరాలనందించి, మీదగ్గరుంటే పంపించి తోడ్పడండి జాగ్రత్తగా తిరిగి పంపగలం. అనిసెట్టిసుబ్బారావుగారికి చెందిన సాహితీసమాచారాన్ని వివరాలను కృతజ్ఞతతో ఈకింది చిరునామాలలో దేనికైనా పంపమని ప్రార్థన

ఏటుకూరి ప్రసాద్
3-6-737/3
హిమాయత్‌నగర్
హైదరాబాద్.500029

మునిపల్లెరాజు
152, SBI కాలనీ
II వెంచర్ గాంధీనగర్
హైదరాబాద్ 500038